

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.10,63,213లు, బంగారం 1 గ్రాము 50 మిల్లీగ్రాములు, వెండి 39 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాష్ట్ర హస్తకళా సంస్కృతి అద్భుతం

రాష్ట్రంలో పర్యటిస్తున్న సింగపూర్ అధ్యక్షుడు ధర్మాన్ షణ్ముగరత్నం దంపతులు రాష్ట్ర హస్త కళా నైపుణ్యతతో మంత్రముగ్ధులయ్యారు.

- 8లో



కార్టూన్ల పాత్ర కీలకం

బలమైన వ్యక్తిని కూడా బలహీనపరిచే ఆయుధం కార్టూన్ అని, చిత్రాల కంటే కార్టూన్లలో సంక్షిప్త వివరణ కీలకమని వక్తలు పేర్కొన్నారు.

- 8లో

సామిత్వ యోజన ప్రారంభం



ముఖ్యమంత్రికి ఇడితాల్ చిత్రాన్ని బహూకరిస్తున్న కలెక్టర్ పట్వారి



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు, కార్యకర్తలు

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- భూములపై సర్వహక్కులు: సీఎం మాఝి
- పలువురు లబ్ధిదారులకు ప్రాపర్టీ పట్టాలు ప్రదానం

రాయగడ:

భూములపై సర్వహక్కులు కలిగించే సామిత్వ పథకం ఒడిశా రాష్ట్రంలో శనివారం ప్రారంభమైంది. రాయగడ, నవరంగపూర్, ఝూర్సుగుడ, గజపతి, డెంకానాల్ జిల్లాల్లో ఈ పథకాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రాయగడలోని బిజు పట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాఝి మాట్లాడుతూ సామిత్వ యోజన ద్వారా అనేక సదుపాయాలు కలుగుతాయన్నారు. ఎంతో మంది నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలు మంజూరైనా ఆయా భూములు ఎక్కడ ఉన్నాయో తెలియజేసే ఆధారిత పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటన్నింటికి సామిత్వ పథకం పరిష్కారం చూపుతుందని చెప్పారు.

డ్రోన్ ద్వారా సర్వే..

సామిత్వ యోజనను పకడ్బందీగా సమీక్షించాకే ఆచరణలోకి తీసుకువచ్చామని సీఎం మాఝి తెలిపారు. ప్రధాని మోదీ 2021లోనే కొన్ని రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేశారని, సత్ఫలితాలు ఇవ్వడంతో ఒడిశాలో అమలు చేసేందుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. దీనిలో భాగంగా తొలి విడతగా 5 జిల్లాల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. సుమారు 3045 గ్రామాల్లో డ్రోన్ సర్వే జరిపామన్నారు. 242 మంది లబ్ధిదారులను గుర్తిం పథకం కింద ప్రాపర్టీ పట్టాలను అందజేశామని తెలిపారు.

దక్షిణ ఒడిశాపై కేంద్రం దృష్టి..

దక్షిణ ఒడిశాలో అంతర్భాగమైన రాయగడ పారిశ్రామికంగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి మాఝి తెలిపారు. కొద్ది రోజుల క్రితం రాయగడ రైల్వే డివిజన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. జిల్లాలోని ఖనిజ ప్రాకృతిక సంపదలను సద్వినియోగం చేసుకుంటే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలనమాధవ హికక తదితరులు ప్రసంగించారు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారి మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో బీజేపీ సర్కారు ముందుంటుందన్నారు. అంతకు ముందు గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానానికి హెలికాప్టర్ ద్వారా వచ్చిన ముఖ్యమంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, కాశీరాం మాఝి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు.



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



లబ్ధిదారులకు ప్రాపర్టీ పట్టాలు పంపిణీ చేస్తున్న సీఎం మాఝి, రెవెన్యూ మంత్రి పూజారి



ప్రాపర్టీ పట్టాలతో లబ్ధిదారులు

న్యూస్‌రీల్

పీఎఫ్ కార్యాలయం ముట్టడి



పీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

జయపురం: జయపురం సేవాపేపరు మిల్లు కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బరంపురంలోని పీఎఫ్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు సేవా పేపరుమిల్లు కార్మిక యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ మహంతి శనివారం తెలిపారు. ఏఐటీయూసీ నేతృత్వంలో మిల్లు కార్మికులంతా ఆందోళనలో పాల్గొన్నట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీఎఫ్ కమిషనర్ ప్రకాశ్‌నారాయణ సింగ్‌కు వినతులు సమర్పించామని తెలిపారు. పేపర్ మిల్లులో పనిచేస్తున్న 1262 మంది కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత ప్రబీర్‌దాస్, ప్రదీప్ శెట్టి, కామదేవ్ నాహక్, రోహిత్ నాయిక్, మిల్లు కార్మిక సంఘ కార్యదర్శి కె.సత్యనారాయణ, బసంత బెహరా తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



భక్తజాని మృతదేహం

మల్కన్‌గిరి : జిల్లాలోని కలిమెల సమితి ఎం.వి.పి- 90 గ్రామానికి చెందిన భక్త జాని (23) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జాని స్వగ్రామం కళ్లహండి జిల్లా గులాముండ గ్రామం. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటి నుంచి మేనమామ మంగరాజ్ మాఝి ఇంట్లో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి అందరితో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. ఇంతలో ఏం జరిగిందో గానీ ఓ గదిలో తువ్వాలుతో ఉరివేసుకుని చనిపోయాడు. ఉదయం నిద్రలేచిన మంగరాజ్ గదికి వెళ్లగా జానీ వేలాడుతూ కనిపించాడు. వెంటనే కలిమెల పోలీసులకు సమాచారమిచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

విదేశీ మద్యంతో ఇద్దరు అరెస్టు



విదేశీ మద్యంతో పట్టుబడ్డిన నిందితులు

మల్కన్‌గిరి: బలిమెల కూడలి వద్ద శుక్రవారం రాత్రి బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయక్ నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఓ ఆటోలో ఇద్దరు వ్యక్తులు మల్కన్‌గిరి నుంచి చిత్రకొండకు అక్రమంగా తరలిస్తున్న విదేశీ మద్యం బాటిళ్లను గుర్తించారు. వారి వద్దనుంచి 60 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి విచారించారు. చిత్రకొండ సమితికి చెందిన రాకేష్ సింగ్, మనోజ్ తురాక్‌గా తెలిసింది. శనివారం వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు.

కారు బీభత్సం

- పేవ్‌మెంట్ పైకి దూసుకువచ్చిన వైనం
- ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం



పేవ్‌మెంట్ పైకి దూసుకువచ్చిన కారు

భువనేశ్వర్: నగరంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఒకేసారి పలు ప్రమాదాలకు పాల్పడిన కారు ఒకరి ప్రాణాల్ని బలిగొంది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రాజ్ భవన్ కూడలి ప్రాంతంలో శనివారం ఉదయం ఈ వరుస ప్రమాదాల సంఘటన చోటు చేసుకుంది. వేగంతో దూసుకుపోయిన కారు బైక్‌ను ఈడ్చుకుంటూ మరో బైక్‌ని ఢీకొంది. దీంతో రాజ్ భవన్ చక్ వద్ద పేవ్‌మెంట్ పైకి దూసుకుపోయింది. కారు ఢీకొనడంతో ఇద్దరు బైక్ చోదకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది.

కర్ర వంతెనపై రాకపోకలు ఆపేయండి



వంతెనపై రాకపోకలు నిషేధిస్తున్నట్లు ఏర్పాటు చేసిన బ్యానర్

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి తొలొసజ్జ గ్రామ సమీపంలో గల నాగావళి నదిపై గ్రామస్తులు తాత్కాలికంగా నిర్మించుకున్న కర్ర వంతెనను జిల్లా యంత్రాంగం నిషేధించింది. ఈ మేరకు బ్యానర్‌ను రహదారి వద్ద ఏర్పాటు చేసింది. గతకొద్ది రోజుల క్రితం ఈ గ్రామానికి చెందిన ప్రజలు సంయుక్తంగా కర్ర వంతెనను నాగావళి నదిపై నిర్మించుకుని రాకపోకలు కొనసాగిస్తున్నారు. తమ గ్రామానికి మధ్యలో గల నాగావళి నదిపై రాకపోకలు కొనసాగేలా వంతెన నిర్మించాలని పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో అందరూ కలిసి రాకపోకలకు అనుకూలంగా నదిపై కర్ర వంతెను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న యంత్రాంగం స్పందించి వంతెనపై రాకపోకలు కొనసాగించకూడదని నిషేధించింది. సమితిలోని సికరపాయి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ సాబొరా ఈ మేరకు బ్యానర్‌ను రహదారి ముందు ఏర్పాటు చేశారు. అందుకు ససేమిరా అంటూ గ్రామస్తులు వంతెనపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇటు వంతెన నిర్మించడానికి పట్టించుకొని ప్రభుత్వం తాము ఏర్పాటు చేసిన వంతెనపై రాకపోకలను ఎలా నిషేధిస్తుందని గ్రామస్తులు అంటున్నారు. కర్రవంతెనపై రాకపోకలు కొనసాగిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్న ఉద్దేశంతోనే దీనిని నిషేధించామని అధికారులు చెబుతున్నారు.

రూ. 10 లక్షల విలువైన కలప స్వాధీనం

- ముగ్గురు అరెస్టు

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న కలపను నాటకీయ పరిణామాల మధ్య అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ డివిజన్ రాయిఘర్ సమితి దండకారణ్య శరణార్థ గ్రామం సోస్‌పూర్ వైపు అక్రమ కలపతో వ్యాన్ వస్తుందని ఛత్తీస్‌గఢ్ అటవీ శాఖ సిబ్బంది ఒడిశా అటవీశాఖకి సమాచారం ఇచ్చారు. దీంతో ఇరు రాష్ట్రాల అధికారులు ఆ ప్రాంతంలోని అన్ని మర్గాలను మూసివేశారు. ఇది గమనించిన కలప స్మగ్లర్లు కలపని సమీపంలో ఉన్న మొక్కజొన్న చేనులో డంప్ చేసేశారు. అయినప్పటికీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఏనుగు దాడి: ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుంభారిక

రాయగడ: ఏనుగు దాడిలో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి మరిడిజోల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గాయపడిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన జింబురు కుంభారికగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కట్టెలను తీసుకువచ్చేందుకు సమీపంలోని అడవుల్లోకి కుంభారిక శుక్రవారం వెళ్లాడు. అదే సమయంలో ఏనుగు తారసపడటంతో భయంతో పరుగులు తీశాడు. అయితే అతనిని వెంబడించిన ఏనుగు అతనిపై దాడి చేసి కొంతదూరం విసిరేసింది. దీంతో గాయాలు పాలైన కుభారికి అచేతన స్థితిలో అక్కడే ఉండిపాయాడు. కుటుంబీకులు అతని రాకకై ఎదురు చూసినప్పటికీ రాత్రయినప్పటికీ రాకపోవడంతో ఆందోళన చెందారు. శనివారం తెల్లవారుజామున అడవిలోకి వెళ్లి గాలించారు. పాపిఖాల్ అడవుల్లో చెట్టు పొదల్లో అపస్మారక స్థితిలో ఉన్న కుంభారికను చూసి కుటుంబ సభ్యులు వెంటనే అతనిని బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. ఏనుగు దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఏనుగు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. గాయపడిన కుంభారిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని వైద్యులు ధ్రువీకరించారు. కొద్ది రోజులుగా ఆరు ఏనుగుల గుంపు ఈ అడవుల్లో తిరుగుతున్నట్లు సమాచారం.

జయపురం అటవీ రేంజ్ పరిధిలో..

పక్షుల లెక్కలు ప్రారంభం



పక్షులు ఉన్న జయపురం జగన్నాథ్ సాగర్

జయపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జయపురం అటవీ విభాగ సిబ్బంది జయపురం రేంజ్ పరిధిలో పక్షుల గణన ప్రారంభించారు. జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ చంద్రబెహర సూచనల మేరకు జయపురం రేంజ్ అధికారి సచిదానంద పొరిడ బలియ జలాశయ ప్రాంతం అడవిలో రంజితా నాయిక్ టీమ్, ఎల్లో డేమ్ ప్రాంతంలో సాశాంక మహరాణ, పాత్రోపుట్ కొలాబ్ నది, జయపురం సాగర్ ప్రాంతంలో సుశీల్ మహంతి బృందాలు పక్షుల లెక్కపెట్టె కార్యక్రమంలో పాల్గొంటున్నారని అటవీ విభాగ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జయపురం రేంజ్ అధికారి సచిదానంద పొరిడ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో పక్షులు భూమిక గురుతరమైనదన్నారు. అందుచేత పక్షులను రక్షించేందుకు వాటికి మంచిఆహారం, వాటికి తగిన ఆశ్రయ స్థలాలు, పక్షుల వంశ వృద్ధి కోసం తగు ఏర్పాట్లను అటవీ విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దూర్బిణీలతో పక్షులను గమనిస్తూ లెక్కిస్తున్నట్లు వెల్లడించారు. పక్షులను లెక్కించేందుకు అటవీ సిబ్బంది ఆయా ప్రాంతాలలో నిరీక్షిస్తున్నారు.



పాత్రోపుట్ కొలాబ్ నది ప్రాంతంలో పక్షులను లెక్కించేందుకు సిద్ధంగా ఉన్న అటవీ సిబ్బంది



ఎల్లో డేమ్‌పై నుండి పక్షులను లెక్కించేందుకు నిరీక్షిస్తున్న అధికారులు

క్రీడా సంరంభం..

- విశ్వవిద్యాలయ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

జయపురం: విక్రమదేవ్ విశ్వ విద్యాలయ ప్రథమ వార్షిక క్రీడోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, ట్రిపుల్ జంప్, జావిలిన్ త్రో, షార్ట్‌పుట్, 800 మీటర్ల రేష్, డిస్కస్‌త్రో, హైజంప్ పోటీలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు విశ్వవిద్యాలయ విద్యార్థులు, కేడర్ విద్యార్థులు రాలీగా స్థానిక మా భగవతి మందిరానికి చేరుకున్నారు. దేవికి పూజలు చేసి అక్కడ నుంచి క్రీడా మసాల ర్యాలీ ప్రారంభమై పట్టణ ప్రధాన మార్గం మీదుగా విశ్వవిద్యాలయ క్రీడా మైదానానికి చేరుకుంది. విశ్వవిద్యాలయ పీజీ విభాగ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో క్రీడా మసాల్ స్వీకరించి పతాకాన్ని ఊపి ప్రారంభించారు. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ అలరించింది. తరువాత డాక్టర్ పాత్రో రెండు దినాల క్రీడా పోటీలు ఆరంభమయ్యాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రంజన్ కుమార్ పాత్రో, ఉపాధ్యక్షులు డాక్టర్ రక్షభ కుమార్ సాహు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సచిన్ కుమార్ నాయిక్, సహాయక ఉపాధ్యక్షులు సంతోషిణి ముండ, స్పోర్ట్స్ ఉపాధ్యాయులు భగవత్ ప్రసాద్ సింగ్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భగవతి మందిరం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ



డిస్క్‌త్రో పోటీలో విద్యార్థిని



షార్ట్‌పుట్ విసురుతూ..



పట్టణ వీధుల్లో క్రీడా ర్యాలీ



క్రీడా పోటీల నిర్వాహక బృందం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్లుప్తంగా

సరికొత్త అవకాశాలకు ప్రేరణ



ధర్మన్ షణ్ముగరత్నానికి పట్టాచిత్రం బహూకరించిన రాష్ట్ర గవర్నర్

భువనేశ్వర్ : సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం రాష్ట్ర పర్యటన సింగపూర్, భారతదేశం మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందని, సరికొత్త అవకాశాలకు ప్రేరణగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి తెలిపారు. చిన్న ద్వీప దేశం నుంచి ప్రపంచ నాయకుడిగా సింగపూర్ అసాధారణ పరివర్తన చెందడం దూరదృష్టితో కూడిన పాలనకు, వ్యూహాత్మక ప్రణాళికకు నిదర్శనమని కొనియాడారు. అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్ఫూర్తిదాయకమైన నమూనాగా పేర్కొన్నారు. సింగపూర్, ఒడిశా మధ్య భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ప్రభావవంతమైన కార్యక్రమాలను నడపడానికి కొత్త అవకాశాల అన్వేషణలకు ఈ పర్యటన ప్రేరణగా నిలుస్తుందని గవర్నరు ఆశాభావం వ్యక్తం చేశారు.

అడవి పందుల స్వైర విహారం



సీతాపురం తోటల్లో ధ్వంసమైన కొబ్బరి చెట్టు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు తదితర గ్రామాల్లో అడవి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో ఆహారం కోసం తోటల్లో సంచరిస్తూ కొబ్బరి చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం పంట పొలాల్లో అడవి పందులకు సరైన ఆహారం దొరకకపోవడంతో కొబ్బరి చెట్టుకున్న కందను తినేందుకు అలవాటుపడ్డాయని, దీంతో కొబ్బరి చెట్లను ధ్వంసం చేస్తున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. తిత్లీ తుఫాన్ ప్రభావంతో కొబ్బరి చెట్లు కూలిపోవడంతో వాటి స్థానంలో నాటిన కొబ్బరి చెట్లను నాశనం చేస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాడుబడిన ఇంట్లో మృతదేహం

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి. పురం పంచాయతీ పరిధి రైల్వే స్థలంలో ఉన్న పాడుబడిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. ఆశవర్కర్ రాపాక డిల్లమ్మ ఆ ఇంటిని చాలా రోజుల క్రితం ఖాళీ చేసి, కంచిలిలో ఇందిరమ్మ కాలనీలో నిర్మించుకున్న ఇంటికి వెళ్లిపోయింది. ఆ వదిలేసిన పూరి గుడిసెలో గుర్తు తెలియని వ్యక్తి ఉరిపోసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఇంటి నుంచి గత నాలుగు రోజులుగా దుర్వాసన రావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. స్థానిక వీఆర్వో బి.రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర హస్తకళా సంస్కృతి అద్భుతం

- సింగపూర్ అధ్యక్షుడు థర్మాన్ షణ్ముగ రత్నం
- రఘురాజ్‌పూర్‌లో కళాఖండాల పరిశీలన

భువనేశ్వర్:

రాష్ట్రంలో పర్యటిస్తున్న సింగపూర్ అధ్యక్షుడు థర్మాన్ షణ్ముగరత్నం దంపతులు రాష్ట్ర హస్త కళా నైపుణ్యతతో మంత్రముగ్ధులయ్యారు. ఈ ప్రాంతపు హస్త కళాఖండాలు అత్యద్భుతమని కొనియాడారు. శనివారం పూరీ జిల్లాలో వారసత్వ గ్రామంగా పేరొందిన రఘురాజ్‌పూర్ సందర్శించారు. స్థానిక జానపద నృత్యాలతో సింగపూర్ అధ్యక్ష దంపతులకు గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు.



పిప్పిలి హస్త కళా ఉత్పత్తులను పరిశీలిస్తున్న సింగపూర్ అధ్యక్ష దంపతులు



కళాభూమిలో సతీమణికి చీర బహూకరించిన సింగపూర్ అధ్యక్షుడు థర్మాన్ షణ్ముగరత్నం

గ్రామంలో పతి గడప ఒక కళా వేదికగా ఈ దంపతుల్ని ఆకట్టుకుంది. గడపకో అద్భుత కళాఖండం అబ్బురపరిచింది. గ్రామస్తులు ఆవిష్కరించిన పలు కళాఖండాల్ని కొనుగోలు చేశారు. వీటిలో రామాయణం ఇతివృత్తంగా రూపుదిద్దుకున్న పట్టా చిత్రం కూడా ఉంది. కళాకారులతో ముఖాముఖి సందర్భంగా పట్టా చిత్రాల శైలిని వివరంగా అడిగి తెలుసుకున్నారు. స్థానిక కళా భూమి సముదాయంలో సింగపూర్ అధ్యక్ష దంపతులు సుమారు 4 గంటలు గడిపారు. ఈ సందర్భంగా ఆయన భార్య కోసం చేనేత చీరను కొనుగోలు చేసి యూపీఐ విధానంలో డబ్బులు చెల్లించారు.



రఘురాజపూర్‌లో ప్రతి గడపలో కళాఖండంతో సింగపూర్ దంపతుల్ని స్వాగతించిన గ్రామస్తులు



పట్టా చిత్రాల శైలిని వివరంగా తెలుసుకుంటూ..



వారసత్వ గ్రామం రఘురాజపూర్‌లో వారసత్వ హస్త కళల్ని కొనుగోలు చేస్తూ..

వైద్యం కోసం వెళ్తూ.. మృత్యు ఒడికి

చిన్నారికి శస్త్ర చికిత్స చేయించాలని ఓ కుటుంబం... వృద్ధులకు వైద్యపరీక్షలు చేయించాలని మరికొందరు... ఇలా సుమారు 40 మంది ఆస్పత్రి బస్సులో పయనమయ్యారు. మరికాసేపట్లో ఆస్పత్రికి చేరుకుంటారన్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదం వారిలో కుదుపురేపింది. ఓ కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తెను మృత్యువు కాటేసింది. ఆస్పత్రికి వెళ్లకుండానే అనంతలోకాలకు తీసుకుపోయింది.

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు
- తండ్రి, కుమార్తెల దుర్మరణం
- 16 మందికి గాయాలు
- మిన్నంటిన హాహాకారాలు



మధుపాడ గ్రామం పాలదారి చెరువు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన అనిల్ నీరుకొండ బస్సు

మల్కన్‌గిరి/గజపతినగరం: ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి ఎం.వి-58 గ్రామం, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 40 మంది అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ బస్సులో వైద్యసేవల కోసం శుక్రవారం రాత్రి బయలుదేరారు. శనివారం ఉదయానికి ఆస్పత్రికి చేరుకుంటామని అంతా భావించారు. ఇంతలోనే విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మధుపాడ పాలదారి చెరువు వద్ద ఆగి ఉన్న లారీని బస్సు బలంగా ఢీకొట్టింటి. అంతే... ఆ ప్రాంతం హాహాకారాలతో మిన్నంటింది. బస్సులో ఉన్నవారంతా చెల్లాచెదురుగా పడ్డారు. ప్రమాదంలో 16 మంది గాయపడగా, వీరిలో తండ్రి, కుమార్తెలు సుబ్రత్‌రాయ్(35), మెహత్ రాయ్ (మూడున్నరేళ్లు) దుర్మరణం చెందారు. సుబ్రత్ రాయ్ తన కుమార్తెకు బీఎస్‌కేవీ (బిజు స్వాత్య కల్యాణ్ యోజన) పథకం కింద అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయించేందుకు బయలుదేరగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కళ్లముందే విగతజీవులుగా మారిన భర్త, కుమార్తెను చూసి మీరా సర్కార్ బోరున విలపించింది. ఆమె స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. గాయపడిన ఎనిమిది మందిని వైద్యసేవల కోసం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, మిలిలిన వారిని అనీల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల, పోడియా సమితి పరిధిలోని గ్రామాల ప్రజలను గతంలోనూ ఇలా బస్సుల్లో తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్స చేయించేవారని గ్రామస్తులు తెలిపారు. ఈ సారి బస్సులో వెళ్తే ప్రమాదానికి గురికావడంతో ఆయా గ్రామాల్లో విషాదం అలముకుంది. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ అప్పారావును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బస్సులో క్షతగాత్రులు



మృతి చెందిన తండ్రీ కూతురు (ఫైల్‌ఫొటో)



ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి మెహత్‌రాయ్



మృతుడు సుబ్రత్‌రాయ్

అలరించిన కళా ప్రదర్శనలు



కళా వేదికపై బొరిగుమ్మ ఎస్‌డీపీవో తపశ్విణీ కుహార్ తదితరులు

జయపురం: కొరాపుటియ కళ, కళాకార మంచ్ వారు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విశాల క్రీడా మైదానంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న పుష్పుణి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం రాత్రి జరిగిన కళా ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ ప్రదర్శనలతో కొరాపుట్ కళా సంస్కృతి ప్రతిధ్వనించింది. కళాకార మంచ్ కార్యదర్శి ధిరెన్ మోహన పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపశ్విణీ కుహార్ పాల్గొన్నారు. వేదికపై ఆదివాసీ కళాకారులు తమ సంప్రదాయ నాట్య సంగీతాలతో అశేష జనసమూహాన్ని అలరించాయి. కొరాపుటియ ఆదివాసీ సంగీత గాయకుడు శ్రీతమ సామంతరాయ్, కిరణ్‌లు శ్రోతలను అలరింపజేశారు. ఈ వేదికపై హాట పొరి నాటో, లెవుటాని, నాచరె మంకుడ నాచ్ నాటికలను ప్రదర్శించారు. హాట పొరి నాటో రచయిత నిరంజన్ పాణిగ్రహి కాగా జితు మిశ్ర దర్శకత్వం వహించారు. లెవుటాని నాటకం రామనాథ్ త్రిపాఠీ రచించగా మహమ్మద్ షరీఫ్ దర్శకత్వం వహించారు. అలాగే నాచరే మంకుడొ నాచ్ నాటికను రచయిత, డైరెక్టర్ నిరంజన పాణిగ్రహిలని నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం ఆరు చిన్న చిత్రాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో క్రీడాకారుడు సుభాష్ రౌత్,క ళాకాణి ప్రకాశ మహంతి, ఆదివాసీ గాయకుడు గణేష్ చంద్ర బిశాయి, సభాపతి మనోజ్ పాత్రో పాల్గొన్నారు.



నాటిక ప్రదర్శనలో కళాకారులు



ఆదివాసీల ధింసా నృత్య ప్రదర్శన

పక్షుల గణనకు శ్రీకారం

భువనేశ్వర్ : శీతాకాలంలో పలు ప్రపంచ దేశాలకు చెందిన భిన్నమైన పక్షులు రాష్ట్రానికి అతిథులుగా వచ్చేస్తాయి. వీటి ఆగమనంతో రాష్ట్రంలో ప్రముఖ జలాశయాలు పక్షుల కిలకిలారాగాలతో ప్రకృతి రమణీయతని రెట్టింపు చేసి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు, సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. ఏటా విచ్చేసే వలస పక్షుల గణన బృహత్కార్యంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ - వాతావరణ మార్పుల విభాగం చేపడుతుంది. ఈ ఏడాది వలస పక్షుల లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర అటవీ, పర్యావరణ - వాతావరణ మార్పుల మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పక్షుల్ని లెక్కించేందుకు ముందస్తుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పక్షులకు మక్కువ..

వలస పక్షులకు రాష్ట్రంలో చిత్తడి నేలలు అత్యంత మక్కువ. ఏటా అతిథి పక్షుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. చలచల్లని సురక్షిత చిత్తడి ఉద్యానాల్లో పక్షులు బస చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. ప్రధానంగా 3 రామ్‌సర్ చిత్తడి నేలలపై పక్షుల లెక్కింపు ప్రాధాన్యం సంతరించుకుంది. వీటిలో చిలికా, హిరాకుడ్, భిత్తర్‌కనికా జలాశయాలు ఉన్నాయి. గత ఏడాది ఈ ప్రాంతాలకు లక్షలాది విభిన్న జాతుల పక్షులు విచ్చేసి ఆతిథ్య ద్వీపాలకు కొత్త రూపుని సంతరింపజేశాయి. రాష్ట్రానికి విచ్చేసే వలస పక్షులను లెక్కించడం అత్యంత ఉత్సాహదాయకమని గణాంక నిపుణులు డాక్టర్ సుజిత్ నర్వాడే ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది పక్షుల లెక్కింపు బృందానికి ఆయన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పక్షుల లెక్కింపులో మెలకువల్ని వివరించారు. అనంతరం సుజిత్ నర్వాడేను మంత్రి సత్కరించారు.



ఒడిశా పక్షుల గణన - 2025 ప్రారంభించిన అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి



పక్షుల గణాంక నిపుణుడు సుజిత్ నర్వాడేని సత్కరించిన మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా



అత్యాధునిక పక్షుల లెక్కింపు పరికరాల నైపుణ్యతను పరిశీలిస్తున్న మంత్రి



హీరాకుడ్ జలాశయంలో పక్షుల్ని లెక్కిస్తున్న నిపుణుల బృందం



చిలికా సరసులో పక్షుల లెక్కింపు



మంగళజొడి ప్రాంతంలో వలస పక్షుల లెక్కింపు బృందం



నొలొబొణొ ప్రాంతంలో అత్యాధునిక వ్యవస్థతో పక్షుల లెక్కింపు



భిత్తరకనికా అభయారణ్యంలో వలస పక్షుల సందడి



హీరాకుడ్ జలాశయంలో పక్షుల విహారం

కార్టూన్ల పాత్ర కీలకం



సత్కారం అందుకున్న కార్టూనిస్టులు

భువనేశ్వర్: బలమైన వ్యక్తిని కూడా బలహీనపరిచే ఆయుధం కార్టూన్ అని, చిత్రాల కంటే కార్టూన్లలో సంక్షిప్త వివరణ కీలకమని ప్రమేయ సంపాదకుడు గోపాల్ మహాపాత్రొ అన్నారు. ఒడిశా కార్టూన్ అకాడమీ 3వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రముఖ కార్టూన్ కళాకారులు శనివారం స్థానిక జయదేవ్ భవన్‌లో సమావేశమయ్యారు. వర్ధమాన పరిస్థితుల్లో కార్టూన్ కళ వాస్తవ స్థితిగతుల్ని ప్రముఖుల సమక్షంలో విశ్లేషించారు. దిన, వార, మాస పత్రికలతో పలు మేగజైన్ల ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వార్తా ప్రసార రంగంలో అత్యధిక పాఠకుల్ని స్పందింపజేసే మాధ్యమం కార్టూన్ అని సంబాద్ సంపాదకురాలు తనయ పట్నాయక్ పేర్కొన్నారు. వార్తాపత్రికల్లో అగ్రస్థానం సాధించే కార్టూన్ల ఆవిష్కరణ పట్ల వర్ధమానతరం కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత, కాలమిస్ట్ మృణాల ఛటర్జీ మాట్లాడుతూ హాస్యం ఆధారిత కార్టూన్ల ప్రాధాన్యతని వివరించారు. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఎడిటర్ ఇన్ చీఫ్, ప్రముఖ పాత్రికేయుడు రూబెన్ బెనర్జీ మాట్లాడుతూ దేశంలో కార్టూనిస్టులపై హింసాత్మక దాడుల సంఘటనలు జరుగుతున్న తరుణంలో ఈ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు పరేష్ నాథ్‌కు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. 18 మంది ప్రముఖ ఒడిశా కార్టూనిస్టులు అభిషేక్ నాయక్, అశ్విని ఒబొని, బిమల్ దాస్, చూడామణి దాస్, దేవాశిష్ సింగ్, కమలాకాంత్ రథ్, కేశు దాస్, నందేషు, పరేష్ నాథ్, ప్రద్యుమ్న నటువా, ప్రశాంత్ మహాకుడు, ప్రశాంత్ మాఝీ, రవి శర్మ, ముందూరు శేఖర్‌రావు, శివనారాయణ, సుదాం శేఖర్ రెడ్డి, సునరామ్ సింగ్ ప్రత్యేక సత్కారం అందుకున్నారు.



ప్రత్యేక సత్కారం అందుకున్న ముందూరు శేఖరరావు



జీవన సాఫల్య అవార్డు అందుకున్న కార్టూన్ కళాకారుడు పరేష్ నాథ్

క్లుప్తంగా

సైకిల్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో సత్యనారాయణ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో సువర్ణముఖీ నది బ్రిడ్జి సమీపంలో సైకిల్‌తో సీతానగరం వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బళ్లకృష్ణాపురం గ్రామానికి చెందిన అక్కేన సత్యనారాయణ(53) శనివారం తామరఖండి రైస్‌మిల్లు నుంచి సైకిల్‌పై సీతానగరం మీ సేవ కేంద్రానికి వస్తుండగా బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ట్యాంకర్ లారీ సువర్ణముఖీ నది బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలో దుర్మరణం చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గాయపడిన వారిలో ఇద్దరి మృతి

సీతంపేట: మండలంలోని అడలి వ్యూ పాయింట్ సమీపంలో మూడు రోజుల క్రితం ఆటో అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి వేర్వేరు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న వారిలో ఇద్దరు శనివారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిలో బూర్జ మండలం కురుంపేట గ్రామానికి చెందిన బొడ్డు యశోదమ్మ(50) శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అలాగే సీతంపేట మండలం వెల్లంగూడకు చెందిన సవర రెల్లియ్య(52) విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడిన వ్యక్తి మృతి

సీతంపేట: మండలంలోని దిగువకారిమానుగూడకు చెందిన సవర బుడ్డయ్య (71) చెట్టు పైనుంచి జారిపడిన సంఘటనలో శనివారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. శుక్రవారం బిల్లగూడ గ్రామ సమీపంలో ఉన్న ములం చెట్టు ఎక్కి ములంకాడలు తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యసేవల కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాచిపెంట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపిన వివరాలు... గొట్టూరు పంచాయతీ పెదగులిగుద్ది గ్రామానికి చెందిన కొర్ర పొట్టయ్య(40) తన భార్యను రాయిగుడ్డివలస పంచాయతీ పనుకువలస గ్రామంలో ఆమె కన్నవారింట ద్విచక్ర వాహనంపై శనివారం తీసుకువెళ్లి దించాడు. తరువాత తిరుగు ప్రయాణమై ఇంటికి వస్తుండగా ఆరో నంబరు జాతీయ రహదారిపై పూడి జంక్షన్ వద్ద అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు పొట్టయ్యను 108లో సాలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఈ-హుండీ ప్రారంభం



రామనారాయణం ఆలయంలో ఈ-హుండీని ప్రారంభించిన బ్యాంకు మేనేజర్‌తో ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలోని రామనారాయణం ఆలయంలో శనివారం ఐవోబీ బ్యాంకు మేనేజర్ సాహు ఈ-హుండీని ప్రారంభించినట్లు ఆలయ వ్యవస్థాపకుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచే దిశగా వాల్మీకి రీసెర్చ్ సెంటర్, వేద పాఠశాల, 80 అడుగుల ఆంజనేయ విగ్రహంపై రామాయణ ఇతివృత్తాన్ని తెలిపే లేజర్ షోను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు ప్రణాళిక ప్రకారం భవిష్యత్తులో మరింత రామాయణ గాథను ప్రతీ ఒక్కరికి తెలియజేసేలా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి

బొండపల్లి: కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరాలపై దాడి చేసి 8 కోడి పుంజులతో పాటు 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యు.మహేష్ శనివారం తెలిపారు. కొత్తపాలెంలో 6 కోడి పుంజులు, ఆరుగురు వ్యక్తులతో పాటు వారి నుంచి రూ.8,900 నగదు, గొట్లాంలో 2 కోడి పుంజులు, ఇద్దరు వ్యక్తులతో పాటు రూ.1400 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కలిసిరాని జీడి పంట

- ఓ వైపు మంచుతో పంటకు నష్టం
- మరోవైపు పంటకు గిట్టుబాటు **ధర కరువు**
- బయట మార్కెట్‌లో కిలో జీడిపిక్కల ధర రూ.180
- గిరిజన రైతులకు చెల్లిస్తున్నది కిలోకు రూ.100 నుంచి రూ.120
- క్వింటా పిక్కలు రూ.18వేలకు కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా దన్నుగా నిలిచేది జీడి పంటే. కొంతకాలంగా జీడిపిక్కలకు మార్కెట్ ధర లేకపోవడం.. పిందె దశలో వర్షాలకు తేనెమంచు ప్రభావం వల్ల పంట దెబ్బతినడం, పిందె రాలి పోవడం వంటి కారణాల వల్ల గిరిజన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర చెల్లించాలని కొన్నాళ్లుగా రైతులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. జిల్లాలో దాదాపు 65 వేల ఎకరాల్లో జీడి తోటలు సాగులో ఉన్నాయి. 30 వేల మంది రైతులు వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క సీతంపేట ఏజెన్సీలోనే సుమారు 25 వేల హెక్టార్ల వరకు ఏటా సాగవుతోంది. సాధారణంగా జీడి పంట డిసెంబర్‌లో పూత దశకు వస్తుంది.

ఆదుకోని యంత్రాంగం..

జిల్లాలోని సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు జీడి తోటలపైనే చాలా ఏళ్లుగా బతుకుతున్నారు. ప్రస్తుతం జీడి పిక్కల ధర మార్కెట్లో కిలో రూ.180 వరకు ఉంది. గిరిజనులకు పంట చేతికందేసరికి దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. జీడి పిక్కలను కిలో రూ.100 నుంచి రూ.120లోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులకు పెట్టుబడి కూడా దక్కడం లేదు. వరి, మొక్కజొన్న, పత్తి మాదిరి జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని రైతు, ప్రజాసంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. క్వింటా పిక్కలు రూ.18 వేల చొప్పున జీసీసీ కొనుగోలు చేయాలని కోరుతున్నాయి. ఆ దిశగా చర్యలు కానరావడం లేదు.

ప్రకటనలకే ప్రాసెసింగ్ యూనిట్లు

జీడి పిక్కల ద్వారా మంచి ఆదాయం పొందేలా ఐటీడీఏల పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని అధికారులు తరచూ ప్రకటనలైతే చేస్తున్నారు గానీ.. ఆచరణలోకి రావడం లేదు. జీడిపప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిన పడకుండా వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మంచి ధర కల్పించేలా చూడాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరుల్లో యూనిట్లను స్థాపించనున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. గిరిజన రైతులకు మేలు చేసేందుకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో గతంలో ఏడు జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. గిరిజన మండలాల పరిధిలోని మహిళా సంఘాల ద్వారా సుమారు రూ.15 లక్షలు వెచ్చించి వీటిని నెలకొల్పారు. ఈ యూనిట్ల ద్వారా గిరిజనులే నేరుగా జీడి పిక్కలు తీసుకువచ్చి, వారే జీడి పప్పును మార్కెట్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కడా పూర్తిస్థాయిలో పని చేయని పరిస్థితి ఉంది. దీనికితోడు యూనిట్ల స్థాపనలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలను వెలుగు అధికారులు మూటగట్టుకున్నారు.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి

జీడిపిక్కలను క్వింటా రూ.18 వేలు చొప్పున జీసీసీ కొనుగోలు చేయాలి. తక్షణమే జీడి ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి, అక్కడ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా గిరిజనులు జీడితోటలపైనే ఆధారపడుతున్నారు. పంట పండకపోయినా, ధర లేకపోయినా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కొల్లి గంగునాయుడు, వి.రమణ, సీపీఎం నాయకులు

స్వచ్ఛ ఆంధ్ర దిశగా అడుగులు





శిక్షణలో పాల్గొన్న ట్రైనీలు (ఇన్‌సెట్లో) శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: స్వచ్ఛ ఆంధ్రా దిశగా అడుగులు వేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జట్టు సంస్థ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం జిల్లా మాస్టర్ ట్రైనీస్ శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను 80 రోజులపాటు గ్రామాల్లో ప్రత్యక్షంగా అమలు చేయాలన్నారు. ఏపీ స్వచ్ఛ రాష్ట్ర సలహాదారు శ్రీనివాసచార్యులు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం దినేష్ రెడ్డి, సెట్విజ్ సీఈఓ ఎస్.రామ్‌గోపాల్, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛగ్రామాల నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. జట్టు భావసమాఖ్య ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, డీఎండబ్ల్యూఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు శాంతి, జట్టు సిబ్బంది, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై పెదకుదమ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జియ్యమ్మవలస: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని పెదకుదమ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రదేశాలను పరిశుభ్రం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. తడి, పొడిచెత్తను వేరుచేసి ఎప్పటికప్పుడు పురపాలక సిబ్బందికి అందజేయాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛ పరిసరాలను అందించే లక్ష్యంతో పనిచేయాలని కోరారు. గ్రామంలోని పారిశుద్ధ్యం, కాలువలు, తాగునీటి పైపులైన్లు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు



శంబరలో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ

- జాతర పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్
- పీఆర్ జేఈ తీరుపై మండిపాటు

మక్కువ: జాతర సమయం ఆసన్నమైంది.. వనం గుడి వద్ద పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి.. పనులు దగ్గరుండి పరిశీలించాల్సిన పీఆర్ జేఈ గైర్హాజరుకావడంపై సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్ మండిపడ్డారు. అధికారుల్లో ఇంత నిర్లక్షదోరణి ఉంటే సరికాదని హెచ్చరించారు. శంబర గ్రామంలో పోలమాంబ జాతర ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. గ్రామంలో సిరిమాను తిరిగే ప్రదేశాల్లో చేపట్టే పనులను పర్యవేక్షించారు. వీధుల్లోని కాలువలపై నడిచే భక్తులు ప్రమాదాలకు గురికాకుండా పలకలు అమర్చాలని సూచించారు. భక్తులు రాకపోకలు సాగించే వీధుల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చివేయాలన్నారు. చదురుగుడి సమీపంలోని మరుగుదొడ్ల చుట్టూ కాంక్రీటు నిర్మాణం జరిపించాలన్నారు. అవసరమైతే నూతనంగా మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగితే సహించేదిలేదన్నారు. జాతరలో తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ నెల 24న మరోసారి పనులు పరిశీలించేందుకు గ్రామానికి వస్తానని, అప్పటిలోగా 80 శాతం పనులు పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. క్యూల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని దేవదాయశాఖ అధికారులకు సూచించారు. గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్లలో విద్యుత్‌లైట్లు వేయాలన్నారు. పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందని, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.డి.స్వరూపరాణి, తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, ఈఓ వి.వి.సూర్యనారాయణ, అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కవోని ఆసక్తి..!

- మొక్కల పెంపకంపై ప్రజల ఆసక్తి
- అందుబాటులోకి నర్సరీలు
- రూ.10 నుంచి మొక్కల ధరలు
- తులసి దగ్గర నుంచి మనీ మొక్క వరకు అమ్మకం
- కడియం నుంచి తెప్పిస్తున్న మొక్కలు



పాలకొండలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పూల మొక్కలు

పాలకొండ రూరల్: మొక్కల పెంపకం ఓ కళ. అందమైన మొక్కలు ఇంటికి అందాన్నే కాదు... మనసుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్నిస్తాయి. ఆరోగ్యకరమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి. ఇంటికి వచ్చేవారిని ఆకర్షిస్తాయి. ఇటీవల కాలంలో ఇంటి పెరటిలోనే కాదు.. కార్యాలయాల్లోనూ వివిధ రకాల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి అనుగుణంగా వ్యాపారులు స్థానికంగా నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలను విక్రయిస్తున్నారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా గోదావరి జిల్లాల్లోని కడియం నుంచి మొక్కలను తెప్పిస్తున్నారు. రూ.10 నుంచి రూ.1000లు విలువైన మొక్కల విక్రయం సాగుతోంది. కొందరు పూలమొక్కలతో పాటు కూరగాయల మొక్కల పెంపకంపైనా ఆసక్తి చూపుతున్నారు.

అన్నింటా మొక్కలకే ప్రాధాన్యం

ఆలయాల ప్రారంభోత్సవం, గృహప్రవేశాలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు స్వాగతం ఇలా... ఏ శుభకార్యమైనా పచ్చని మొక్కల వినియోగం ఇటీవల కాలంలో పెరిగింది. కొందరు అధికారులైతే అభినందనలు తెలియజేసేందుకు మొక్కలు పట్టుకుని రావాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొక్కల కొనుగోళ్లు విరివిగా సాగుతున్నాయి. నర్సరీల్లో రోజుకు రూ.50వేల వరకు వ్యాపారం సాగుతున్నట్టు అంచనా. గులాబీ, మందారం, చామంతి మొక్కల విక్రయాలు అధికంగా సాగుతున్నాయి. వీటితోపాటు మనీప్లాంట్, లక్కీ ప్లాంట్, లక్కీబేంబో, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, తైవాన్ జామ, హైబ్రీడ్ కొబ్బరి, అరటి, బోగనవల్లీ, యాపిల్ తదితర మొక్కలను సైతం కొనుగోలు చేస్తున్నారు. తులసి మొక్క ధర అత్యల్పంగా రూ.10లు కాగా, బోగనవల్లీ మొక్క ధర రూ.1000లు పలుకుతోంది. దాలియా, మల్లి, సన్నజాజి. వంగ, మిరప వంటి మొక్కలను విక్రయిస్తున్నారు. ఆరెకే పాండ్స్ అనే ఆక్సిజన్ మొక్కలను ఇటీవల ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ మొక్కలు ఆక్సిజన్ ఇస్తాయనే అభిప్రాయం అందరిలో ఉంది. దేవాలయాల్లో వేసే ఏక బిల్వం, మహా బిల్వం, మారేడు, ఉసిరి, జమ్మి, శంకు, రుద్రాక్ష, పసుపు గన్నేరుతోపాటు పూజలకు వినియోగించే పలు మొక్కలకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుందని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు.



అదృష్ట చిహ్నంగా పిలువబడే లక్కీప్లాంట్



ఆకట్టుకుంటున్న బోగన వల్లీ



సీజనల్ చామంతులు



అందుబాటులో ఉన్న గులాబీలు

ఇరు వర్గాల ఘర్షణలో పది మందికి గాయాలు



గజపతినగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఒకరి పరిస్థితి విషమం

దత్తిరాజేరు: మండలంలోని చినచామాలాపల్లిలో ఇరువర్గాల మధ్య శనివారం ఉదయం జరిగిన ఘర్షణలో పది మంది గాయపడినట్టు పెదమానాపురం ఎస్‌ఐ జయంతి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. శుక్రవారం గ్రామంలో క్రికెట్ ఆడుతుండగా చెలరేగిన వివాదం నేపథ్యంలో ఒక వర్గం అమ్మాయిలపై అసభ్య మెసేజ్‌లు పెట్టారని వేరే వర్గం ప్రశ్నించడం ఈ క్రమంలో వివాదం పెద్దదై ఇరు వర్గాల వారు కర్రలతో కొట్లాడుకున్నారని తెలిపారు. దీంతో మన్యాల అప్పలస్వామి, తిరుపతి, మన్యాల సత్యం, మన్యాల నర్సయ్య, తమడ గణేష్, దుర్గారావు, డి.శ్రీను, వెంకటరమణతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. వీరు గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నట్టు తెలిపారు. కొట్లాట నేపథ్యంలో గ్రామాన్ని గజపతినగరం సీఐ జీఏవీ రమణ సందర్శించారు. వివాదానికి కారణమైన పది మంది యువకులను, వారి బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట బొండపల్లి, ఎస్.భూర్జవలస ఎస్‌ఐలు మహేష్, రాజేష్ ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రమణ

బంగారు వెండి ఆభరణాల చోరీ

బొబ్బిలి: సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు కుటుంబ సభ్యులు వెళ్లిన నేపథ్యంలో పట్టణంలోని దాడితల్లి కాలనీలో రెండు ఇళ్లలో దొంగలు చొరబడి బంగారు, వెండి అభరణాలు దొంగిలించారు. మరిశర్ల సింహాచలం అనే ఉపాధ్యాయుడి ఇంట్లో దూరి కిలో వెండి, తులంన్నర బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. అదే కాలనీలో ఉంటున్న గొట్టాపు వేణు అనే కాజా కళాశాల అధ్యాపకుడి ఇంట్లో 350 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదును అనుసరించి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు.

హోటల్ గదిలో యువకుని మృతి

శృంగవరపుకోట: హోటల్ గదిలో యువకుని మృతి కొత్తవలస పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొత్తవలస పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న స్టార్ రూమ్స్ హోటల్లో విశాఖపట్నం విమాన్‌నగర్‌కు చెందిన యువకుడు బస చేశాడు. కాగా శనివారం సాయంత్రం హోటల్ సిబ్బంది తమ హోటల్ గదిలో యువకుడు ఉరి వేసుకుని మరణించినట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ షణ్ముఖరావు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు విమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన జీవన్‌శర్మగా గుర్తించారు. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుని మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



హోటల్ గదిలో ఉరి వేసుకొని విగతజీవిగా ఉన్న జీవన్‌శర్మ

పీడీఎస్ బియ్యం పట్టివేత

పార్వతీపురం: బొబ్బిలి నుంచి జిమిడిపేట డీఎంయూ ట్రైన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ ఎం.రాజేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు డీఎంయూ ట్రైన్‌లో ఏడు ప్లాస్టిక్ సంచుల్లో 2.20కిలోల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని విక్రయించిన, కొనుగోలు చేసిన, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.